క్లుప్తంగా

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ


పద్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నాగేశ్వరరావు, నాయకులు

కూసుమంచి: మండలంలోని పోచారానికి చెందిన మాజీ ఎంపీపీ రామసహాయం వెంకటరెడ్డి తల్లి పద్మమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే, కుటుంబ సభ్యులకు పరామర్శించారు. నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, మాదాసు ఉపేందర్, ఎండీ అహ్మద్ అలీ, సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రేలా వెంకటరెడ్డి, కేశవరెడ్డి, సేట్రాం నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, మహిపాల్, జనార్దన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నర్సింహాపురానికి చెందిన తల్లాడ మల్లయ్యకు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు సోమవారం నగరంలో రూ.20 వేలతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, కోశాధికారి దుర్గా శంకర్, కొండా వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శంకర్‌రావు, ఓంకార్, విశ్వనాథం, మురళి తదితరులు పాల్గొన్నారు.

‘ఏకలవ్య’కు గరిడేపల్లి విద్యార్థిని ఎంపిక


భట్టు అనూష

కామేపల్లి: తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ఆరో తరగతిలో ప్రవేశానికి మండలంలోని గరిడేపల్లి పాఠశాల గిరిజన విద్యార్థి భట్టు అనూష ఎంపికైంది. మారుమూల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన గిరిజన విద్యార్థి అనూష ఏకలవ్య పాఠశాలకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, అనూషను ఎంఈఓ వెంకటేశ్వర్లు అభినందించారు.

అందుబాటులోకి పెసర విత్తనాలు

రఘునాథపాలెం: మండలకేంద్రమైన రఘునాథపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పెసర విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన వారు పట్టాదారు పాసు పుస్తకం , ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకొచ్చి విత్తనాలు పొందవచ్చని తెలిపారు. 4 కేజీలు ధర రూ.480 చెల్లించి పొందవచ్చని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	లవ్‌మీ
వినోద	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సాయిరాం	హిట్‌లిస్ట్
ఆదిత్య	గమ్ గమ్ గణేశా
శ్రీనివాస	భజే వాయు వేగం

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	4 / 20
వంకాయ	20	పాలకూర	3 / 20
బెండకాయ	18	చుక్కకూర	3 / 20
పచ్చిమిర్చి	100	తోటకూర	4 / 20
కాకర	56	గోంగూర	4 / 20
బీర	66	మెంతికూర	3 / 20
దొండ	16	కొత్తిమీర	1 / 30
పొట్లకాయ	40	పుదీన	1 / 20
గోరుచిక్కుడు	60		
క్యాబేజీ	20		
క్యాలీఫ్లవర్	24		
ఆలుగడ్డ	34		
చామగడ్డ	48		
క్యారెట్	60		
క్యాప్సికం	66		

-ఖమ్మం వ్యవసాయం

చదువుకునేది ఎలా..?

సిటీ లైబ్రరీలో సౌకర్యాలు కరువు

- పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని నిరుద్యోగుల ఆవేదన


లైబ్రరీలో ఫ్యాన్లు ఏసీలు పనిచేయక చెట్టు కింద చదువుతున్న అభ్యర్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ కొలువులు సాధించేందుకు పుస్తకాలను కుస్తీ పడుతున్న నిరుద్యోగ అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. వీరు చదువుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ గ్రంథాలయాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉద్యోగాల సాధన కోసం చదువుకునేందుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండడం, అందరికి సరిపడ లేకపోవడంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాత భవనంలోని కౌన్సిల్ హాల్‌ను సిటీ గ్రంథాలయంగా తీర్చిదిద్దారు. ఈ గ్రంథాలయం ప్రారంభించే సమయంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. అయితే నాలుగు నెలలుగా ఈ గ్రంథాలయాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో తీవ్ర సమస్యల నడుమ నిరుద్యోగ అభ్యర్థులు చదువుకోలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా సరిగ్గా లేదని, అడిగితే పట్టించుకునేవారే లేరని ఆవేదన చెందుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్‌లు జారీ చేసిన వేళ.. గ్రంథాలయంలో సౌకర్యాలు లేకపోవడంతో చదువుకునేది ఎలా అంటూ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తమను పట్టించుకుని కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

తిరగని ఫ్యాన్లు..

సిటీ గ్రంథాలయంలో నిత్యం వంద మంది వరకు పోటీ పరీక్షల కోసం చదువుకుంటున్నారు. అభ్యర్థుల కోసం గ్రంథాలయంలో ఫ్యాన్లు, ఏసీలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ చూసే వారు లేకపోవడంతో అవి సక్రమంగా పని చేయడం లేదు. ఏసీలు ఆన్‌చేస్తే వైరింగ్ కాలిపోతుందని ఎలక్ట్రిషియన్ చెప్పాడని ఏసీలు కూడా ఆన్ చేయనివ్వడం లేదని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఎండలకు ఫ్యాన్ గాలి వేడిగా వస్తుందని, అవి సక్రమంగా తిరగడం లేదని వాపోతున్నారు. అధికారులకు చెప్పేందుకు వెళ్తున్నా మూడు నెలలుగా ఎన్నికల కోడ్ పేరుతో సమస్యను పట్టించుకోవడం లేదంటున్నారు. గ్రంథాలయంలో లైటింగ్ కూడా సక్రమంగా లేదు.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు..


నిలిచిన మురుగు నీరు

ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అభ్యర్థులు అంతా గ్రంథాలయంలోనే ఉంటారు. వీరి కోసం పాత మున్సిపాలిటీలో రూ.5ల భోజన సదుపాయం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే గ్రంథాలయంపై అధికారులు, పాలకులు శీతకన్ను వేయడంతో కొన్ని నెలలుగా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మహిళలు, పురుషులు చదువుకునే ఈ గ్రంథాలయంలో టాయిలెట్లను శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు మరుగుదొడ్లలోనే నిలిచిపోవడంతో వాసనతో అభ్యర్థులు టాయిలెట్ గదుల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉంది.

ఆరు నెలలుగా ఇబ్బంది..



ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో రెండేళ్లుగా గ్రంథాలయంలో చదువుకుంటున్నాం. ఆరు నెలలుగా పలు సమస్యలు వేధిస్తున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చిన సమయంలో చదువుకోవాల్సిన మేమంతా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

– ఏసుబ్, గ్రూప్స్ అభ్యర్థి

తాగేందుకు నీరు కూడా లేదు..



గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు అయిన తాగునీరు, టాయిలెట్స్ కూడా సక్రమంగా లేవు. అధికారులు, పాలకులు తమ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫ్యాన్లు, ఏసీలు పని చేయక అభ్యర్థులంతా వేడిగాలుల్లోనూ బయట కూర్చుని చదువుకుంటున్నారు. సమస్యలు లేకుండా చదువుకునేందుకు కనీస చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పూర్ణ చందర్‌రావు, డీఎస్సీ అభ్యర్థి

తవ్వి వదిలేసిన డ్రెయినేజీలు


డ్రెయినేజీని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం అన్నారు. సోమవారం నగరంలోని ఎన్ఎస్‌టీ రోడ్డులో తవ్వి వదిలేసిన డ్రెయినేజీలను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ... నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, ఇంటింటి చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరగడం లేదన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యానాలి సాంబశివరెడ్డి, ఎండీ రెహమాన్, డి.శేఖర్, జ్వల నర్సింహారావు, డాక్టర్ ఖాసీం పాషా, ఎస్‌కె.జానీ, వి.రమణ, దుర్గానాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనాసాగరం వాసికి పురస్కారం


అవార్డుతో వీరబాబు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారానికి చెందిన చిలకబత్తిని వీరబాబు శ్రీ ఎన్టీఆర్ విశిష్ట పురస్కారం అందుకున్నారు. ఆర్.కే. కళా సాంస్కృతిక ఫాండేషన్ ఆధ్వర్యాన ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయనకు ప్రకటించిన అవార్డును సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబును గ్రామస్తులు పలువురు అభినందించారు.

జక్కేపల్లి గాయనికి..


పురస్కారం అందుకుంటున్న కవిత

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లికి చెందిన జానపద గాయని కోడిరెక్క కవితకు పురస్కారం లభించింది. స్వాతంత్ర్య సమరయోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతి, తెలంగాణ అవతరణను పురస్కరించుకుని ఆర్‌కే.కళా ఫౌండేషన్ బాధ్యులు పురస్కారం ప్రకటించగా హైదరాబాద్‌లో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, హైకోర్టు న్యాయమూర్తి మధుసూదన్ చేతుల మీదుగా అందుకున్నారు.

త్రివేణి విద్యార్థినికి అభినందనలు



మోక్షిత సాయిని అభినందిస్తున్న త్రివేణి డైరెక్టర్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: పాలిసెట్ ఫలితాలు సోమవారం వెల్లడి కాగా జిల్లా కేంద్రంలోని త్రివేణి పాఠశాల విద్యార్థి ఏపూరి మోక్షిత సాయి ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మోక్షిత సాయి 118 మార్కులతో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్ సాధించగా, ఎస్ఎస్.లక్ష్మి 70, నేహశ్రీ 497, సాత్విక 585, ఎం.వెంకటేశ్వర్లు 594, అభిరాం 721ర్యాంక్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావుతో పాటు మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ అంత్యక్రియలు

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెంలో ఇరువర్గాల ఘర్షణను అడ్డుకునే క్రమంలో గాయపడి మృతి చెందిన తేజావత్ వీర్యానాయక్ అంత్యక్రియలను సోమవారం నిర్వహించారు. కాగా, ఘటన జరిగిన ఆదివారం రాత్రి నుంచే రఘునాథపాలెం సీఐ శ్రీహరి ఆధ్వర్యాన గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం వీర్యా మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా, బందోబస్తు నడుమ అంత్యక్రియలు పూర్తయ్యాయి. కాగా, బీఆర్ఎస్ నాయకుడైన తేజావత్ వీర్యానాయక్ మృతదేహం వద్ద పలువురు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు మక్బూల్, కూరాకుల వలరాజు, కన్నం ప్రసన్నకృష్ణ, మోతారపు సుధాకర్‌తో పాటు చెరుకూరి ప్రదీప్, బోజెడ్ల రామ్మోహన్, బాల్దె నాగేశ్వరావు, రమేష్, వెంకట్, నరమళ్ల వెంకన్న, వీరేందర్, తిరుమల్, ఆకుల సురేష్ తదితరులు పాల్గొనగా.. ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

కాగా, వీర్యా మృతి కేసులో దశరథ్, రమేష్, రాంబాబు, రవిని అరెస్ట్ చేసినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీహరి తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

ఖమ్మంరూరల్: గంజాయి నియంత్రణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. బషీరుద్దీన్ తెలిపారు. మండలంలోని ఏదులాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి శ్రీను, నాయకులు రేవంత్, బాషా, సత్యనారాయణ, ఉపేందర్, యాదగిరి, అన్వేష్, నాగేశ్వరరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందించాలి

కూసుమంచి: దళిత, గిరిజన రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని సీపీఎంఎల్ మాస్‌లైన్ రైతుసంఘం నాయకులు పోటు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, వ్యవసాయ యాంత్రాలు, పరికరాలు సబ్సిడీపై అందించాలన్నారు. నాయకులు వెంకయ్య, రేపాకుల శివలింగం, హనుమంతరావు, సత్యనారాయణ, రోషయ్య, మచ్చునాయక్, వీరన్న గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల ముగింపు


కామేపల్లి: జెండా ఎగురవేస్తున్న నాయకులు

కామేపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ శ్రేణులు మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కూడళ్లలో జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ముగింపు పలికారు. నాయకులు అంతోటి అచ్చయ్య, సామా మోహన్‌రెడ్డి, కాట్రాల రాంబాబు, కన్నమాల రాంబాబు, అజ్మీర విజయలక్ష్మి, రాజు, భూక్యా హేమ్లా, బన్సిలాల్, మంచాల వెంకన్న, గండమల రమేష్, రవి పాల్గొన్నారు.


ఖమ్మం మామిళ్లగూడెం: పాదిల వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

ఉద్యమకారుడికి సన్మానం...

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యమకారుడు ఖమ్మానికి చెందిన ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగి పాదిల వెంకటేశ్వర్లును మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో పలువురు సత్కరించారు. నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, మారెళ్ల లక్ష్మణరావు, తాత రఘురాం, మామిళ్ల రాంబాబు, నిజాం తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి పాటుపడాలి

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: మత సామరస్యానికి ప్రతీకగా ఖమ్మం జిల్లా వుందని, సోదర భావంతో మెలగడం మంచి సంప్రదాయమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీ సభ్యులతో సోమవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. బక్రీద్ పర్వదినాలను శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ జరుపుకోవాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే అక్రమ రవాణా కట్టడికి కమిషనరేట్ పరిధిలో 7 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకురావద్దన్నారు. ఈ సందర్భంగా వివిధ మత పెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించి పోలీసు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలకు వారి వంతు సహకారం అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో గెంటెల విద్యాసాగర్, కె. విజయపాల్ రెడ్డి, బి. రామకృష్ణ, యండీ అసాద్, అయూబ్, యండీ. మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్ నాయక్

కూసుమంచి: వర్షాకాలం ప్రారంభమవుతున్నందున సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్ కోరారు. సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. మండలంలో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, ఇందుకు వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల పొలాలకు అనువుగా చెరువుమట్టిని తవ్వుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠ్యపుస్తకాలు అందించాలని, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు మండలాభివృద్ధిలో తనకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, మండల ప్రజలకు ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీఓ రాంచందర్‌రావు, ఐబీ డీఈఈ రత్నకుమారి, ఏఓ వాణి, ఎంఈఓ బీవీ రామాచారి, పశు సంవర్ధకశాఖ అధికారి నీలకాంత్, సీహెచ్ఓ వలీయుద్దీన్, ఐకేపీ ఏసీఎం సత్యవర్ధన్‌రాజు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ


తనిఖీ చేస్తున్న ఏఓ తారాదేవి, ఎస్సై ప్రవీణ్‌కుమార్

కామేపల్లి: వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి తారాదేవి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేసి, తగిన రసీదులు పొందాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ, మాయమాటలు చెబుతూ నకిలీ విత్తనాలు అమ్మేవారిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విత్తన దుకాణాదారులు విక్రయించిన విత్తన ప్యాకెట్లపై బ్యాచ్ నంబర్, రసీదుపై తేదీలు, ఎమ్మార్పీ ధరలు ఉండేలా రైతులు సరిచూసుకోవాలని వారు సూచించారు.

ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులను 6, 7వ తరగతులకు గణితం బోధించాలని విద్యాశాఖ తీసుకున్న ఉత్తర్వులను రద్దు చేసేలా చూడాలని కోరుతూ ఫిజికల్ సైన్స్ ఫోరం ఖమ్మం బాధ్యులు ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులుకు విన్నవించారు. సోమవారం ఆయనకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఫోరం బాధ్యులు మాట్లాడుతూ.. 6 నుంచి 10 తరగతులకు గణిత ఉపాధ్యాయులు గణితం సబ్జెక్ట్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఫిజికల్ సైన్స్, జీవశాస్త్రం బోధించే విధంగా జీవో ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి, షేక్ మన్సూర్, ఫిజికల్ సైన్స్ ఫోరం బాధ్యులు శ్రీను, జగదీశ్వర్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం వర్తక సంఘం వద్ద బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, సెంట్రల్ ఈసీ సభ్యులు కైలాసపు వేణుగోపాల్‌రావు, పాయల నాగేశ్వరరావు, జంగిలి రమణ, రామారావు, యల్లారావు, భాస్కర్, రామ్మూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ నూతన జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఖమ్మం చెరువు బజారులోని గ్లోబల్ హెల్డింగ్ సెంటర్ హాల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సినీ దర్శకులు ఎం.సేనాపతి మాట్లాడుతూ... తెలంగాణలో ఉన్న సబ్బండ వర్గాల కులాలకు ఐక్యం చేస్తూ వారిని సహనిర్మాతలను చేస్తూ చిత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ సలహాదారుడిగా డాక్టర్ ఖిజరుల్లా, జిల్లా చైర్మన్‌గా బానోతు భద్రూనాయక్ , వైస్ చైర్మన్‌గా పెళ్లూరి విజయకుమార్, కన్వీనర్‌గా షేక్ అబ్దుల్ రెహమాన్, కో కన్వీనర్‌గా మామిడాల ఝాన్సీ, కార్యవర్గ సభ్యులుగా ఉపేంద్రబాయి, జమీల్, మీగడ రామారావు, రెడ్డిబోయిన వరలక్ష్మి, మేకల రమాదేవి, గోవిందమ్మ, నాగమణి, దామల్ల జయ, వెంకట్రామయ్య, అనంతలక్ష్మి, కల్పన, నజీమా, స్పందన, జ్యోతి, యాషన్, త్రివేణి, పద్మ, లలిత, కోటేశ్వరరావు, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఫలితాల ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు


ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన డిజిటల్ స్క్రీన్

ఖమ్మం మయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడి కానుండగా అంతటా ఆసక్తి నెలకొంది. దీంతో పలువురు ఇళ్లలోనే ఫలితాలు చూసేందుకు సిద్ధమయ్యారు. అయితే, ప్రయాణాల్లో ఉన్న వారు కూడా ఫలితాలను తెలుసుకునేలా ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో సోమవారం సాయంత్రం భారీ డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా స్క్రీన్ ఏర్పాటుచేయడంతో ఫలితాలు తెలుసుకోవడం సులువు కానుంది.